



# అక్షరశక్తి

The Power of Pen

Evening Daily

సంపుటి: 20 | సంచిక: 303 | వరంగల్ | సోమవారం, 07 సెప్టెంబర్ 2026 | పేజీలు: 07


## ఫీజు బకాయిలపై కవిత పోరుబాట



### విద్యార్థులతో కలిసి హన్మకొండ కలెక్టరేట్ ముట్టడి..

విద్యార్థుల ఫీ రీయింబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే చెల్లించాలని, స్కాలర్‌షిప్‌లు విడుదల చేయడంతో పాటు విద్యార్థుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ రక్షణ సేన అధ్యక్షులు కల్వకుంట్ల కవిత సోమవారం హనుమకొండలో ఆందోళనకు దిగారు. వందలాది మంది విద్యార్థులతో కలిసి అంబేద్కర్ విగ్రహం నుంచి హనుమకొండ కలెక్టరేట్ వరకు ర్యాలీ నిర్వహించారు. అంతకుముందు అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కలెక్టరేట్‌కు చేరుకున్న అనంతరం విద్యార్థులందరినీ లోపలికి అనుమతించి వారి సమస్యలను కలెక్టర్ వినాలని కవిత డిమాండ్ చేశారు. అధికారులు అనుమతించకపోవడంతో విద్యార్థులతో కలిసి కలెక్టరేట్ ప్రధాన గేటు ఎదుట నడిరోడ్డుపై బైఠాయించి నిరసన తెలిపారు. సుమారు అరగంటపాటు ఎండలోనే కూర్చున్న కవిత ఆందోళనతో అధికారులు దిగివచ్చి విద్యార్థులను కలెక్టరేట్‌లోకి అనుమతించారు. - అక్షరశక్తి, హనుమకొండ

- మూడేళ్లుగా ఫీ రీయింబర్స్‌మెంట్ చెల్లించలేదు
- విద్యార్థులు, కళాశాలలపై తీవ్ర ప్రతికూల ప్రభావం
- సర్టిఫికెట్లు ఇవ్వక లక్షలాది మంది ఉద్యోగాలకు దూరమవుతున్నారని ఆవేదన
- విద్యార్థులను కలెక్టరేట్‌లోకి అనుమతించాలని పోలీసులతో వాగ్వాదం
- కలెక్టర్‌ను కలిసి సమస్యల పరిష్కారానికి వినతిపత్రం..
- ప్రభుత్వంపై పోరాటం కొనసాగిస్తామని ప్రకటన
- తరాలపల్లిలో టీఆర్ఎస్ పార్టీ జెండా ఆవిష్కరణ

3





## కేటీఆర్, హరీశ్‌రావు అరెస్టు..

నల్ల టీషర్టులు ధరించి బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీల నిరసన

- అసెంబ్లీలోకి వెళ్లకుండా అడ్డుకున్న పోలీసులు
- అసెంబ్లీ మెయిన్ గేట్ వద్ద ఉద్రిక్తత

6

## ఎమ్మెల్సీ తాతా మధు సభ్యత్వం రద్దు చేయాలి

- ఎమ్మెల్సీ తాతా మధు సభ్యత్వం రద్దు చేయాలి
- స్పీకర్‌ను అవమానించడం ప్రజాస్వామ్యాన్ని అవమానించడమే
- తాతా మధు వ్యాఖ్యలకు కేసీఆర్ సమాధానం చెప్పాలి..
- వరంగల్ డీసీసీ అధ్యక్షుడు అయూబ్



5



## కాంగ్రెస్ ప్రభుత్వంపై దాస్యం ఫైర్

- బీఆర్ఎస్ ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలను అసెంబ్లీకి రానివ్వకపోవడంపై మండిపాటు
- ప్రతిపక్ష ప్రజాప్రతినిధుల హక్కులను కాలరాస్తున్నారని ఆగ్రహం
- హన్మకొండలో భారీ ధర్నా.. ప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం

5



## ప్రతి దరఖాస్తును బాధ్యతగా పరిష్కరించాలి

**జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు**

**అక్షరశక్తి,ములుగు:** ప్రజావాణిలో అందిన ప్రతి దరఖాస్తును అధికారులు బాధ్యతతో పరిశీలించి సత్వరమే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు ఆదేశించారు. సోమవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం లోని సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ప్రజల నుంచి నేరుగా దరఖాస్తులను స్వీకరించారు. అర్జీదారుల సమస్యలను అడిగి తెలుసుకొని, వాటి పరిష్కారానికి చర్యలు చేపట్టాలని సంబంధిత శాఖల అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ప్రజావాణి కార్యక్రమంలో భూ సమస్యలు 9, ఇందిరమ్మ ఇండ్లు 1, పింఛన్లు 1, ఉద్యోగాలు 15, ఇతర శాఖలకు సంబంధించినవి 10 కలిపి మొత్తం 36 దరఖాస్తులు అందాయి. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు మాట్లాడుతూ, ప్రజావాణి దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించి నిర్ణీత గడువులో పరిష్కరించాలని సూచించారు. పరిష్కారానికి అవకాశం ఉన్న సమస్యలపై జాప్యం చేయకుండా చర్యలు తీసుకోవాలని, దరఖాస్తుల పరిష్కార స్థితిని ఎప్పటికప్పుడు అర్జీదారులకు తెలియజేయాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు సంపత్ రావు, ఆర్డీఓ కృష్ణవేణి, జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## ప్రజావాణి దరఖాస్తుల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి పెట్టాలి

- పెండింగ్ దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించి పరిష్కరించాలి
- హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయి



**అక్షరశక్తి,హనుమకొండ:** ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల నుంచి స్వీకరించిన దరఖాస్తుల పరిష్కారంపై అన్ని శాఖల అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయి ఆదేశించారు. పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను శాఖల వారీగా పరిశీలించి, క్షేత్రస్థాయిలో సమస్యలను పరిశీలించిన అనంతరం నిబంధనల మేరకు పరిష్కరించాలని సూచించారు. సోమవారం హనుమకొండ జిల్లా కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయి, అదనపు కలెక్టర్ ఎన్. రవి ప్రజల నుంచి దరఖాస్తులను స్వయంగా స్వీకరించారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజలు తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువచ్చి పరిష్కరించాలని కోరారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజలు తమ సమస్యల పరిష్కారం కోసం ప్రజావాణిలో సమర్పించిన దరఖాస్తులు పెండింగ్‌లో ఉండకుండా నిర్ణీత గడువులోగా పరిష్కరించాలన్నారు. అవసరమైన సందర్భాల్లో అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి సమస్యలను పరిశీలించాలని సూచించారు. దరఖాస్తులపై తీసుకున్న చర్యల వివరాలను దరఖాస్తుదారులకు తెలియజేయాలని ఆదేశించారు. ప్రజావాణి కార్యక్రమంలో జిల్లాస్థాయిలో 123, డివిజన్ స్థాయిలో 23, మండల అధికారుల స్థాయిలో 123 దరఖాస్తులు అందాయి. మొత్తం 269 దరఖాస్తులు ప్రజల నుంచి స్వీకరించారు. కార్యక్రమంలో జిల్లా ఇన్‌చార్జి అదనపు కలెక్టర్ శేషాద్రి, డీఆర్ఓ శ్రీనివాస్, డీఆర్‌డీఓ మేన శ్రీను, సీపీఓ సత్యనారాయణరెడ్డి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# తెలంగాణలో జరిగేది గౌరవ సభ కాదు కౌరవ సభ

- మాజీ మంత్రి సత్యవతి రాథోడ్
- మానుకోట కలెక్టరేట్ వద్ద ధర్నా
- ప్రజావాణిలో వినతిపత్రాల అందజేత



**అక్షరశక్తి, మహబూబాబాద్ :** కాంగ్రెస్ వెయ్యి రోజుల అసమర్ధత పాలనపై బీఆర్ఎస్ పార్టీ చేపట్టిన నిరసన కార్యక్రమాలలో భాగంగా సోమవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా చేశారు. ఈ సందర్భంగా మహబూబాబాద్ కలెక్టర్ కు ప్రజావాణిలో దరఖాస్తులు మాజీ మంత్రి, బీఆర్ఎస్ పార్టీ జనరల్ సెక్రెటరీ సత్యవతి రాథోడ్, మాజీ ఎంపీ మాలిక్ కవిత, మాజీ శాసన సభ్యులు బాణోత్ శంకర్ నాయక్, డీఎస్ రెడ్యానాయక్, మాజీ జడ్పీ చైర్మన్ బిందు అంగోత్, స్థానిక బిఆర్ఎస్ నాయకులు అందజేశారు.

**ఈ సందర్బంగా మాజీ మంత్రి సత్యావతి రాథోడ్ మాట్లాడుతూ..**

అసెంబ్లీ ప్రాంగణంలో బిఆర్ఎస్ ఎమ్మెల్యేలపై పోలీసుల దౌర్జన్య కాండకు దిగారని ఆరోపించారు. గౌరవ సభ ముందు కౌరవ పర్వం పోలీసుల చేత ఈ దాష్టీక ప్రభుత్వం కొనసాగించిందని విమర్శించారు. శాసన సభ ముందు నేడు జరిగింది దుష్యాసన పర్వం మళ్లీ కనపడిందని ఆరోపించారు. నాడు కౌరవులకు పట్టిన గతే రేపు కాంగ్రెస్ పార్టీకి పడుతుందని హెచ్చరించారు. ఇది కాంగ్రెస్ ప్రజాపాలన కాదుప్రజావ్యతిరేక పాలనంటూ నిప్పులు చెరిగారు. కాంగ్రెస్ ను ఆంధ్రాలో బొంద పెట్టిన ఆఖరి కిరణం కిరణ్ కుమార్ రెడ్డి అయితే తెలంగాణలో బొంద పెడుతున్న ఆఖరి కిరణం రేవంత్ రెడ్డి అని విమర్శలు గుప్పించారు. మహిళా నేతల మీద కాంగ్రెస్ ప్రభుత్వ దుశ్శాసన పర్వం చూస్తుంటే తెలంగాణ మహిళలమీద కాంగ్రెస్ ప్రభుత్వ తీరు ప్రస్ఫుటంగా తెలిపోయిందని అన్నారు. మహిళలకు బయట రక్షణ లేదు, అసెంబ్లీలో కూడా రక్షణ లేదా అని ప్రశ్నించారు. భారత రాజ్యాంగానికి విరుద్ధంగా, ఈ కాంగ్రెస్ ప్రభుత్వ పాలన కొనసాగుతుందని సత్యవతి ఆరోపించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ స్నేహా శబరీష్ కు పార్టీ తరుపున వినతి పత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి డీఎస్. రెడ్యా నాయక్, మాజీ ఎంపీ, పార్టీ జిల్లా అద్యక్షురాలు మాలోతు కవిత , మాజీ ఎమ్మెల్యే బానోత్ శంకర్ నాయక్, మాజీ జెడ్పీ ఛైర్మన్ బిందు, బీఆర్ఎస్ పార్టీ నాయకులు పరకాల శ్రీనివాసరెడ్డి, పాల్వాయి రాం మోహనరెడ్డి, మార్నేని వెంకన్న, యాళ్ల మురళీధర్ రెడ్డి, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.





# చేనేతకు గౌరవం.. సమాజ సేవకు గుర్తింపు

**అక్షరశక్తి, హనుమకొండ :** ఓరుగల్లు గడ్డపై పద్మశాలి సమాజం, చేనేత రంగ ప్రతిభకు ఘనమైన గౌరవం దక్కింది. నేతన్న టీవీ ప్రథమ వార్షికోత్సవం సందర్భంగా నిర్వహించిన 'నేతన్న టీవీ బిగ్గెస్ట్ అవార్డ్స్-2026' వేడుక హనుమకొండ బీమారంలోని ఎస్‌వీఎస్ కాలేజీ ఆడిటోరియంలో ఆదివారం అట్టహాసంగా జరిగింది. స్వరాజ్ టీవీ సౌజన్యంతో నేతన్న టీవీ సీఈవో పులికంటి రాజేందర్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి తెలంగాణ నలుమూలల నుంచి పద్మశాలి ప్రముఖులు, ప్రజాప్రతినిధులు, సామాజిక నాయకులు, కళాకారులు, చేనేత కార్మికులు, పాత్రికేయులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. తమ తమ రంగాల్లో విశేష ప్రతిభ, సేవలు అందించిన పలువురిని ఎంపిక చేసి ప్రతిష్టాత్మక పురస్కారాలతో సత్కరించారు. పద్మశాలి సమాజంలోని వివిధ రంగాల ప్రతిభావంతులను ఒకే వేదికపైకి తీసుకువచ్చి ఇంత భారీ స్థాయిలో అవార్డులు అందించడం అభినందనీయమని ప్రముఖులు కొనియాడారు. కుడా చైర్‌పర్సన్ గుండు సుధారాణి, పద్మశాలి కార్పొరేషన్ చైర్మన్ గూడూరు శ్రీనివాస్, తెలుగు అకాడమీ చైర్మన్ కూరపాటి వెంకటనారాయణ, మాజీ ఎమ్మెల్యే వన్నాల శ్రీరాములు, అఖిల భారత పద్మశాలి సంఘం జాతీయ అధ్యక్షుడు కందకట్ల స్వామి, తెలంగాణ ప్రాంత పద్మశాలి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కమర్తపు మురళి, జాతీయ గుండు ప్రభాకర్,అఖిల భారత పద్మశాలి సంఘం మాజీ జాతీయ అధ్యక్షుడు ఈగ మల్లేశం, బీసీ సంఘం జాతీయ నాయకులు గుజ్జ సత్యం తదితరులు కార్యక్రమంలో పాల్గొని నేతన్న టీవీ కృషిని అభినందించారు. అనంతరం నేతన్న టీవీ, స్వరాజ్ టీవీ సీఈవో పులికంటి రాజేందర్ మాట్లాడారు. కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మాచర్ల రామచందర్, తెలంగాణ ప్రాంత పద్మశాలి సంఘం రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు గుంటక రూపా సదాశివ్, తెలంగాణ పద్మశాలి ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఈగ వెంకటేశ్వర్లు, రాష్ట్ర ఉపాధ్యక్షులు వద్నాల నరేందర్, వైద్యం రాజగోపాల్, రాష్ట్ర నాయకులు తౌటం రవీందర్-ఝాన్సీరాణి, మాజీ జెడ్పీ చైర్‌పర్సన్ సాంబారి సమ్మారావు, వరంగల్ ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు వేముల నాగరాజు, టీయూడబ్ల్యూజే-ఐజేయూ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు గడ్డం కేశవ మూర్తి, జర్నలిస్టులు వల్లాల వెంకటరమణ, వేముల సదానందం తదితరులు పాల్గొన్నారు.





# మట్టి గణపతిని ప్రతిష్టించాలి.. పర్యావరణాన్ని రక్షించాలి

**అక్షరశక్తి,హనుమకొండ:** సెయింట్ పీటర్స్ హైస్కూల్‌లో ప్రముఖ సామాజికవేత్త నిమ్మల శ్రీనివాస్ ప్రారంభించిన ఏడు రోజుల అవగాహన కార్యక్రమం పాఠశాల కరస్పాండెంట్ గోపు జైపాల్ రెడ్డి అధ్యక్షతన ప్రారంభమైంది. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ ప్లాస్టర్ ఆఫ్ పారిస్ విగ్రహాలను నీటిలో నిమజ్జనం చేయడం వల్ల పర్యావరణానికి కలిగే అనర్థాలను విద్యార్థులకు వివరించారు. ప్రకృతిని పరిరక్షించేందుకు మట్టి వినాయక విగ్రహాలను ప్రతిష్ఠించి, పర్యావరణహితంగా వినాయక చవితిని జరుపుకోవాలని సూచించారు.



పాఠశాల కరస్పాండెంట్ గోపు జైపాల్ రెడ్డి మాట్లాడుతూ పిల్లలకు ఆరోగ్యకరమైన జీవనంతో పాటు స్వచ్ఛమైన, మంచి వాతావరణాన్ని అందించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. విద్యార్థులు ప్రదర్శించిన పర్యావరణ పరిరక్షణకు సంబంధించిన ప్లకార్డులు ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా నిమ్మల శ్రీనివాస్ పాఠశాలకు మట్టి వినాయక ప్రతిమను అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల అధ్యాపకులు వినయ, మీనాక్షి, సంధ్య, జోష్న, వినీత తదితరులు పాల్గొన్నారు.

# ఫీజు బకాయిలపై కవిత పోరుబాట




- విద్యార్థులతో కలిసి హన్మకొండ కలెక్టరేట్ ముట్టడి..
- మూడేళ్లుగా ఫీ రీయింబర్స్‌మెంట్ చెల్లించలేదు
- విద్యార్థులు, కళాశాలలపై తీవ్ర ప్రతికూల ప్రభావం
- సర్టిఫికెట్లు ఇవ్వక లక్షలాది మంది ఉద్యోగాలకు దూరమవుతున్నారని ఆవేదన
- విద్యార్థులను కలెక్టరేట్‌లోకి అనుమతించాలని పోలీసులతో వాగ్వాదం
- కలెక్టర్‌ను కలిసి సమస్యల పరిష్కారానికి వినతిపత్రం..
- ప్రభుత్వంపై పోరాటం కొనసాగిస్తామని ప్రకటన
- తరాలపల్లిలో టీఆర్ఎస్ పార్టీ జెండా ఆవిష్కరణ

**అక్షరశక్తి, హనుమకొండ:** విద్యార్థుల ఫీ రీయింబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే చెల్లించాలని, స్కాలర్‌షిప్‌లు విడుదల చేయడంతో పాటు విద్యార్థుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ రక్షణ సేన అధ్యక్షులు కల్వకుంట్ల కవిత సోమవారం హనుమకొండలో ఆందోళనకు దిగారు. వందలాది మంది విద్యార్థులతో కలిసి అంబేద్కర్ విగ్రహం నుంచి హనుమకొండ కలెక్టరేట్ వరకు ర్యాలీ నిర్వహించారు. అంతకుముందు అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కలెక్టరేట్‌కు చేరుకున్న అనంతరం విద్యార్థులందరినీ లోపలికి అనుమతించి వారి సమస్యలను కలెక్టర్ వినాలని కవిత డిమాండ్ చేశారు. అధికారులు అనుమతించకపోవడంతో విద్యార్థులతో కలిసి కలెక్టరేట్ ప్రధాన గేటు ఎదుట నడిరోడ్డుపై బైఠాయించి నిరసన తెలిపారు. సుమారు అర గంటపాటు ఎండలోనే కూర్చున్న కవిత ఆందోళనతో అధికారులు దిగివచ్చి విద్యార్థులను కలెక్టరేట్‌లోకి అనుమతించారు.

**మూడేళ్లుగా బకాయిలే..**

ఈ సందర్భంగా కవిత మాట్లాడుతూ.. ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు చెల్లించకుండా ప్రభుత్వం విద్యార్థులను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తోందని ఆరోపించారు. ''ఈ ప్రభుత్వం మూడేళ్లుగా ఫీ రీయింబర్స్‌మెంట్ బకాయిలు చెల్లించడం లేదు. దీంతో చిన్న ప్రైవేట్ కళాశాలలు మూతపడే పరిస్థితి ఏర్పడింది. పేద విద్యార్థులకు ఇవ్వాల్సిన స్కాలర్‌షిప్‌లు, ఫీజు బకాయిలు చెల్లించడం లేదు. విద్యార్థులకు ఇవ్వాల్సిన స్కూటీలు కూడా అందడం లేదు'' అని అన్నారు. ఫీ రీయింబర్స్‌మెంట్ అందకపోవడంతో కోర్సులు పూర్తి చేసినప్పటికీ కళాశాలల యాజమాన్యాలు విద్యార్థులకు సర్టిఫికెట్లు ఇవ్వడం లేదని కవిత పేర్కొన్నారు. దీంతో లక్షలాది మంది డిగ్రీ, ప్రొఫెషనల్ డిగ్రీలు పూర్తి చేసినా సర్టిఫికెట్లు చేతికి రాక ఉద్యోగాలు పొందలేకపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వం వెంటనే బకాయిలు చెల్లించాలని డిమాండ్ చేశారు.

**విద్యా విధానంపై ప్రశ్నలు**

ముఖ్యమంత్రి విద్యా రంగంపై స్థిరమైన విధానం లేకుండా భిన్నమైన ప్రకటనలు చేస్తున్నారని కవిత విమర్శించారు. ఒకసారి ఇంటర్మీడియట్ విద్యా విధానాన్ని తీసేస్తామని, మరోసారి పాలిటెక్నిక్ కళాశాలలను స్కిల్ యూనివర్సిటీలో విలీనం చేస్తామని చెబుతున్నారని అన్నారు. విద్యార్థుల భవిష్యత్తుతో ప్రభుత్వం ప్రయోగాలు చేయకూడదని సూచించారు. అసెంబ్లీ సమావేశాల్లో విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లు, కళాశాలల సమస్యలపై ప్రభుత్వం స్పష్టమైన ప్రకటన చేయాలని డిమాండ్ చేశారు. ఫీజుల కోసం విద్యార్థులు నాలుగు కిలోమీటర్లు నడుచుకుంటూ ర్యాలీగా వచ్చారని, వారి కష్టాలను ప్రభుత్వం గుర్తించి సానుకూలంగా స్పందించాలని కోరారు. ఫీ రీయింబర్స్‌మెంట్ బకాయిలు పూర్తిగా చెల్లించే వరకు ప్రభుత్వంపై పోరాటం కొనసాగిస్తామని స్పష్టం చేశారు.

**కలెక్టర్‌కు సమస్యల నివేదన**



అధికారులు విద్యార్థులను కలెక్టరేట్ ప్రాంగణంలోకి అనుమతించిన అనంతరం కవిత విద్యార్థులతో కలిసి హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్‌ను కలిశారు. ఫీ రీయింబర్స్‌మెంట్ బకాయిల కారణంగా చిన్న ప్రైవేట్ కళాశాలలు మూతపడే పరిస్థితి నెలకొందని, కోర్సులు పూర్తి చేసిన విద్యార్థులకు యాజమాన్యాలు సర్టిఫికెట్లు ఇవ్వడం లేదని కలెక్టర్‌కు వివరించారు. కలెక్టర్ స్పందిస్తూ.. ప్రతి సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించే ప్రజావాణికి ఫీ రీయింబర్స్‌మెంట్ బకాయిల కారణంగా సర్టిఫికెట్లు అందడం లేదని ముగ్గురు, నలుగురు విద్యార్థులు వచ్చి ఫిర్యాదు చేస్తున్నారని తెలిపారు. ఆయా కళాశాలల యాజమాన్యాలతో మాట్లాడి సమస్య పరిష్కారానికి ప్రయత్నిస్తున్నామని చెప్పారు. ఏళ్ల తరబడి ఫీజు బకాయిలు చెల్లించకపోవడంతో కళాశాలల యాజమాన్యాలు కూడా ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని కవిత పేర్కొంటూ, సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. దీనిపై కలెక్టర్ సానుకూలంగా స్పందించి కవిత అందజేసిన వినతిపత్రాన్ని ఉన్నతాధికారులకు పంపిస్తానని హామీ ఇచ్చారు.

**తరాలపల్లిలో పార్టీ జెండావిష్కరణ**

అనంతరం హనుమకొండ జిల్లా తరాలపల్లిలో తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కవితకు పార్టీ శ్రేణులు ఘన స్వాగతం పలికాయి. అక్కడ పార్టీ జెండాను ఆవిష్కరించిన కవిత.. ప్రజలకు మంచి చేయాలనే గట్టి సంకల్పంతో కొత్త పార్టీతో ప్రజల ముందుకు వచ్చామని తెలిపారు. ముఖ్యంగా విద్య, వైద్య రంగాల్లో ప్రజల జేబుల నుంచి రూపాయి కూడా ఖర్చు కాకూడదన్నదే తమ లక్ష్యమన్నారు. ''20 ఏళ్లుగా మీ మధ్యలో ఉన్న ఆడబిడ్డను నేను. మీకు మంచి చేయాలనే ఉద్దేశంతో పార్టీ పెట్టాను. మన పార్టీ జెండా రంగు అమ్మవారికి ఇష్టమైన పసుపు రంగు. కచ్చితంగా మీ అందరి ఆశీర్వాదం నాపై ఉంటుందని ఆశిస్తున్నా'' అని కవిత అన్నారు. సామాజిక న్యాయం జరగాలని, అన్ని వర్గాలకు మేలు జరగాలన్నదే తమ ఆకాంక్ష అని తెలిపారు. ప్రజల అజెండాతో ముందుకు వచ్చామని, ప్రజలు తమను ఆదరిస్తారన్న నమ్మకం ఉందన్నారు. తరాలపల్లిలో పోచమ్మ ఆలయ విగ్రహ ప్రతిష్ఠాపన పూజల్లోనూ కవిత పాల్గొన్నారు. ఈ సందర్భంగా అమ్మవారికి నూతన వస్త్రాలు సమర్పించారు. ఆలయ అర్చకులు కవితతో ప్రత్యేక పూజలు చేయించారు.

**వనవాసం పోయినట్టుగా అయోధ్యపురం రైతుల పరిస్థితి**

అయోధ్యపురం రైతుల పరిస్థితి వనవాసం పోయినట్టుగా ఉందని తెలంగాణ రక్షణ సేన అధ్యక్షులు కల్వకుంట్ల కవిత ఆందోళన వ్యక్తం చేశారు. సోమవారం అయోధ్యపురంలోని రైల్వే కోచ్ ఫ్యాక్టరీని ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా కవిత మాట్లాడుతూ.. కాజీపేట కోచ్ ఫ్యాక్టరీ కారణంగా భూములు కోల్పోతున్న బాధితులందరికీ అండగా ఉంటామని హామీ ఇచ్చారు. తమ భూములు దేవాదాయ శాఖ భూములతో కలిసి ఉండడంతో పరిహారం విషయంలో అన్యాయం చేశారని ఈ సందర్భంగా నిర్వాసితులు కవితకు వివరించారు. దేవాదాయ శాఖతో పాటు బాధితుల భూములు కలిపి ఉండటంతో గతంలో డీజిల్ ఫ్యాక్టరీ కోసం భూసేకరణ చేసినప్పుడు 90 శాతం తమకు 10 శాతం దేవాదాయ శాఖ పరిహారం ఇచ్చారని బాధితులు చెప్పారు. ఇప్పుడు మాత్రం ఎకరాకు 33 లక్షల పరిహారం ఇస్తే అందులో తమకు 8 లక్షలు మాత్రమే ఇచ్చి మిగతా ఎక్కువ మొత్తం దేవాదాయ శాఖ అప్పగించారని తెలిపారు. ఈ విషయంలో తమకు న్యాయం చేయాలని వారు కోరారు. నిర్వాసితులకు పరిహారంలో న్యాయం జరిగేలా పోరాటం చేస్తామని కవిత వారికి హామీ ఇచ్చారు. మహారాష్ట్రలోని లాతూరు కోచ్ ఫ్యాక్టరీ ఏర్పాటు చేసిన సందర్భంలో అక్కడి భూ నిర్వాసితులకు 734 ఉద్యోగాలు ఇచ్చారని కవిత గుర్తు చేశారు. అదే విధంగా ఇక్కడ కూడా భూ భాదితుల కుటుంబంలో ఒకరికి ఉద్యోగాలు వచ్చేలా చేస్తామన్నారు. కోచ్ ఫ్యాక్టరీ ప్రారంభమయ్యేలోపు బాధితులకు న్యాయం జరిగేలా చేస్తామని వారికి మాటిచ్చారు. ఈ అంశానికి సంబంధించి కేంద్ర రైల్వే శాఖ మంత్రితో పాటు మన రాష్ట్రానికి చెందిన కేంద్రమంత్రులు కిషన్ రెడ్డి, బండి సంజయ్ లకు కూడా లేఖ రాస్తానని కవిత అన్నారు.

**గ్రేటర్ ఎన్నికలే లక్ష్యం**

తెలంగాణ రక్షణ సేన నాయకులు, కార్యకర్తలు ఎప్పుడూ ప్రజల పక్షాన, ప్రజల మధ్యలో ఉండాలని కవిత సూచించారు. వచ్చే గ్రేటర్ వరంగల్ ఎన్నికల్లో అన్ని స్థానాల నుంచి తమ పార్టీ పోటీ చేస్తుందని ప్రకటించారు. ఇక్కడి నుంచే తమ విజయ పరంపర ప్రారంభమవుతుందని ధీమా వ్యక్తం చేశారు.





## బీఆర్ఎస్ ఆధ్వర్యంలో ధర్నా



**అక్షరశక్తి, నర్సంపేట** : కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి 1000 రోజులు అయిన సందర్భంగా బీఆర్ఎస్ పార్టీ ఇచ్చిన రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా పట్టణ అధ్యక్షుడు నాగేల్లి వెంకటనారాయణ ఆధ్వర్యంలో ఆర్డీవో కార్యాలయంలో నిర్వహించిన గ్రీవెన్స్ లో వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా మాజీ రాష్ట్ర రైతు డైరెక్టర్ రాయిడి రవీందర్ రెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రావడానికి ఆచరణకు సాధ్యం కానీ హామీలు ఇచ్చి రేవంత్ ప్రభుత్వం గద్దనెక్కిందని వాటి అమలుకు వెయ్యి రోజులు గడిచిన ఒక్క హామీ పూర్తిస్థాయిలో అమలు కాలేదని ధ్వజమెత్తారు. ఈ కార్యక్రమంలో టిఆర్ఎస్ జిల్లా సీనియర్ నాయకులు నల్ల మనోహర్ రెడ్డి మాజీ డివిజన్ కోఆర్డినేటర్ తక్కలపల్లి రవీందర్రావు డివిజన్ నాయకులు డాక్టర్ లెక్కల విద్యాసాగర్ రెడ్డి రాష్ట్ర మాజీ ఖనిజాభివృద్ధి సంస్థ డైరెక్టర్ నాడెం శాంతి కుమార్ బీఆర్టీయూ జిల్లా అధ్యక్షుడు గోనె యువరాజు, కౌన్సిలర్ శివరాత్రి స్వామి నవీన్ నాయక్ మాజీ కౌన్సిలర్ నాగిశెట్టి ప్రసాద్ బండి ప్రవీణ్ దార్ల రమాదేవి పెండెం వెంకటేశ్వర్లు గందె చంద్రమౌళి యువజన విభాగం పట్టణ అధ్యక్షుడు రాయుడి దుష్యంత రెడ్డి క్లస్టర్ నాయకులు రాంప్రసాద్ కుమారస్వామి వార్డు అధ్యక్షులు మోతే తిరుపతిరెడ్డి బీరం నాగిరెడ్డి పైసా ప్రవీణ్ మాదాసి ప్రవీణ్ మండల కుమారస్వామి సాలయ్య మంద ప్రసాద్ భాస్కర్ మహిళా నాయకులు విజయ రాణి స్వరూప నాయకులు, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

## కేయూ 24వ స్నాతకోత్సవానికి గవర్నర్ సూత్రప్రాయ అంగీకారం



**అక్షరశక్తి, కేయూ క్యాంపస్** : హైదరాబాద్‌లోని లోక్‌భవన్‌లో కాకతీయ విశ్వవిద్యాలయ ఉపకులపతి ఆచార్య కె. ప్రతాప్‌రెడ్డి సోమవారం తెలంగాణ రాష్ట్ర గవర్నర్, విశ్వవిద్యాలయ ఛాన్సలర్ శివ ప్రతాప్ శుక్లాను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కాకతీయ విశ్వవిద్యాలయం నిర్వహించనున్న 24వ స్నాతకోత్సవానికి గవర్నర్‌ను ఉపకులపతి ఆహ్వానించారు. స్నాతకోత్సవాన్ని నవంబర్ నెలలో నిర్వహించేందుకు గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా సూత్రప్రాయంగా అంగీకరించినట్లు విశ్వవిద్యాలయ రిజిస్ట్రార్ ఆచార్య వి. రామచంద్రం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా స్నాతకోత్సవ నిర్వహణకు సంబంధించిన అంశాలను ఉపకులపతి గవర్నర్‌కు వివరించారు. గవర్నర్ సూత్రప్రాయ అంగీకారంతో 24వ స్నాతకోత్సవ నిర్వహణకు మార్గం సుగమమైందని రిజిస్ట్రార్ తెలిపారు. ఈ కార్యక్రమంలో పరీక్షల నియంత్రణాధికారి ప్రొఫెసర్ రాజేందర్ కట్లా కూడా పాల్గొన్నారు.

## అనుమతులు లేని కళాశాలలపై చర్యలు తీసుకోవాలి

**అక్షరశక్తి, హనుమకొండ** : ప్రభుత్వ అనుమతులు లేకుండా నిర్వహిస్తున్న రేసోనెన్స్, రేసో మెడికాన్ జూనియర్ కళాశాలల బ్రాంచీలపై తక్షణమే చర్యలు తీసుకోవాలని డెమోక్రటిక్ స్టూడెంట్స్ అసోసియేషన్ (డీఎస్ఏ) డిమాండ్ చేసింది. సోమవారం హనుమకొండ కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణిలో ఈ మేరకు జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్‌కు ఫిర్యాదు చేశారు. డీఎస్ఏ రాష్ట్ర కన్వీనర్ కామగోని శ్రావణ్ మాట్లాడుతూ.. రేసోనెన్స్, రేసో మెడికాన్ పేరుతో ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా అదనపు బ్రాంచీలను నిర్వహిస్తూ విద్యార్థుల నుంచి లక్షల్లో ఫీజులు వసూలు చేస్తున్నారని ఆరోపించారు. రేసోనెన్స్‌కు మూడు బ్రాంచీలకు మాత్రమే అనుమతి ఉండగా, అదనంగా తొమ్మిది బ్రాంచీలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రభుత్వ నిబంధనలను ఉల్లంఘిస్తున్న ఆయా కళాశాలలను సీజ్ చేసి, యాజమాన్యాలపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు.

**డీఐఈఓపై చర్యలు తీసుకోవాలి**

అక్రమ బ్రాంచీలపై జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారికి పలుమార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని శ్రావణ్ ఆరోపించారు. నగరంలోని పలు ప్రైవేట్, కార్పొరేట్ జూనియర్ కళాశాలలపై ఫిర్యాదులు చేసినప్పటికీ చర్యలు తీసుకోలేదని అన్నారు. ప్రైవేట్, కార్పొరేట్ కళాశాలలకు వత్తాసు పలుకుతున్న డీఐఈఓను విధుల నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు. డీఎస్ఏ జిల్లా కన్వీనర్ ఉప్పుల శివ మాట్లాడుతూ నిబంధనలు ఉల్లంఘిస్తున్న కళాశాలలపై సమగ్ర విచారణ జరిపి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌ను కోరినట్లు తెలిపారు. ఫిర్యాదుపై తక్షణమే విచారణ చేపట్టి అవసరమైన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ హామీ ఇచ్చినట్లు పేర్కొన్నారు.

# హామీల అమలులో కాంగ్రెస్ విఫలం

- 1000 రోజుల పాలనలో మహిళలకు ఒరిగిందేమీ లేదు
- కల్యాణలక్ష్మి, షాదీముబారక్ కొనసాగించకుంటే కాంగ్రెస్ పని ఖతం
- అసెంబ్లీ ఘటనపై నిరసన.. రేవంత్‌రెడ్డి ఫొటో దహనం



**అక్షరశక్తి, పాలకుర్తి** : కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి 1000 రోజులు పూర్తవుతున్నా ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు విమర్శించారు. బీఆర్ఎస్ అధిష్ఠానం పిలుపు మేరకు సోమవారం జనగామ జిల్లా పాలకుర్తి మండల కేంద్రంలో నిర్వహించిన నిరసన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. బీఆర్ఎస్ మహిళా నాయకులతో కలిసి వంటావార్పు చేపట్టారు. అనంతరం అసెంబ్లీ వద్ద బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలపై పోలీసుల దాడిని నిరసిస్తూ రాస్తారోకో నిర్వహించి, సీఎం రేవంత్‌రెడ్డి ఫొటోను దహనం చేశారు. ఈ సందర్భంగా ఎర్రబెల్లి మాట్లాడుతూ.. నల్ల టీషర్టులు ధరించి నిరసన తెలిపిన బీఆర్ఎస్ నాయకులపై పోలీసులు దాడి చేయడం అమానుషమన్నారు. అసెంబ్లీ సాక్షిగా మహిళా ఎమ్మెల్యేల పట్ల పోలీసులు వ్యవహరించిన తీరు బాధాకరమన్నారు. ''రాహుల్‌గాంధీ నల్ల చొక్కాతో పార్లమెంట్‌కు వెళ్లినప్పుడు లేని అభ్యంతరం మాపై ఎందుకు?'' అని ప్రశ్నించారు. పోలీసులను అడ్డుపెట్టుకుని రేవంత్‌రెడ్డి రాక్షస పాలన సాగిస్తున్నారని ఆరోపించారు. మహాలక్ష్మి పథకం కింద మహిళలకు రూ.2,500, వృద్ధులు, ఒంటరి మహిళలకు రూ.4 వేల పెన్షన్, దివ్యాంగులకు రూ.6 వేల ఆర్థిక సాయం, మహిళలకు స్కూటీలు, ల్యాప్‌టాప్‌లు ఇస్తామని హామీ ఇచ్చి అమలు చేయలేదని ఎర్రబెల్లి విమర్శించారు. కల్యాణలక్ష్మి, షాదీముబారక్‌తో పాటు తులం బంగారం ఇస్తామని చెప్పి మహిళలను మోసం చేశారన్నారు. కేసీఆర్ హయాంలో కల్యాణలక్ష్మి, కేసీఆర్ కిట్, పెన్షన్లతో ప్రజలకు అండగా నిలిచామని పేర్కొన్నారు. అన్ని వర్గాల సంక్షేమానికి కేసీఆర్ పాలనే తెలంగాణకు శ్రీరామరక్ష అని అన్నారు. మరో రెండేళ్లలో కాంగ్రెస్ పాలనకు ప్రజలు చరమగీతం పాడతారని, తిరిగి కేసీఆర్ ప్రభుత్వం వస్తుందని ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ జిల్లా, మండల నాయకులు, మహిళలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# పింగిళి మహిళా కళాశాలలో టూరిజం సర్టిఫికేట్ కోర్సు ప్రారంభం


- పర్యాటక రంగంలో ఇంగ్లీష్ భాషా నైపుణ్యాలు కీలకం: ప్రొఫెసర్ రామ్ భాస్కర్ రాజు



**అక్షరశక్తి,హన్మకొండ:** వడ్డేపల్లిలోని పింగిళి ప్రభుత్వ మహిళా కళాశాల చరిత్ర విభాగం ఆధ్వర్యంలో విద్యార్థినుల కోసం ప్రత్యేకంగా టూరిజం సర్టిఫికేట్ కోర్సును నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా సోమవారం కళాశాలలో నిర్వహించిన కార్యక్రమంలో కాకతీయ ప్రభుత్వ స్వయం ప్రతిపత్తి కళాశాల ప్రొఫెసర్ డాక్టర్ ఇ. రామ్ భాస్కర్ రాజు ముఖ్య వక్తగా పాల్గొని 'ఇంగ్లీష్ ఫర్ టూరిజం' అంశంపై ప్రసంగించారు. కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ లెఫ్టినెంట్ డాక్టర్ బి. చంద్రమౌళి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ సుహాసిని సహాధ్యక్షత వహించారు. చరిత్ర విభాగం అధిపతి డాక్టర్ కొలిపాక శ్రీనివాస్ సర్టిఫికేట్ కోర్సు కన్వీనర్‌గా, నిర్వహణ కార్యదర్శిగా వ్యవహరిస్తూ ఉపన్యాసాల శ్రేణిని నిర్వహిస్తున్నారు. సుమారు రెండు గంటల పాటు విద్యార్థినులతో ముఖాముఖి పద్ధతిలో సాగిన కార్యక్రమంలో పర్యాటక రంగంలో ఇంగ్లీష్ భాషా ప్రావీణ్యత ప్రాధాన్యతను ప్రొఫెసర్ రామ్ భాస్కర్ రాజు వివరించారు. ముఖ్యంగా వారసత్వ సంపదను పర్యాటకులకు అర్థమయ్యేలా వివరించడం, సమర్థవంతమైన సంభాషణ నైపుణ్యాలపై అవగాహన కల్పించారు. వారసత్వ పర్యాటకంలో భౌతిక, సాంస్కృతిక వారసత్వ సంపద ప్రాధాన్యత, పర్యాటకులను ఆకట్టుకునే కథన నైపుణ్యం, ప్రసంగ నైపుణ్యాలు, కంఠస్వరంలో మార్పులు, వివిధ సంస్కృతులకు చెందిన పర్యాటకులతో గౌరవంగా సంభాషించడం వంటి అంశాలను వివరించారు. అలాగే పర్యాటక బృందాలను సమర్థవంతంగా నిర్వహించడం, సేవా భావంతో వ్యవహరించడం, చారిత్రక కట్టడాలు, మ్యూజియంలు, పుణ్యక్షేత్రాలు, ప్రకృతి రమణీయ ప్రాంతాల్లో గైడ్‌గా వ్యవహరించే విధానాలను వివరించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ఐక్యూఏసీ సమన్వయకర్త, కంప్యూటర్ సైన్స్ అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ డి. సురేష్‌బాబు, ఎకనామిక్స్ విభాగం డాక్టర్ పద్మ, చరిత్ర విభాగం అతిథి అధ్యాపకులు, ఇతర అధ్యాపకులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

# వెయ్యి రోజుల కాంగ్రెస్ పాలనపై బీఆర్ఎస్ నిరసన





**అక్షరశక్తి, హన్మకొండ** : రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ వెయ్యి రోజుల పాలనలో ప్రజలకు ఇచ్చిన హామీల అమలులో విఫలమైందని నిరసిస్తూ భారత రాష్ట్ర సమితి (బీఆర్ఎస్) పార్టీ చేపట్టిన వారం రోజుల పోరుబాట కార్యక్రమంలో భాగంగా హనుమకొండలో నిరసన కార్యక్రమాలు కొనసాగుతున్నాయి. బీఆర్ఎస్ పార్టీ చేపట్టిన ఈ పోరుబాటలో భాగంగా మాజీ చీఫ్ విప్, మాజీ శాసనసభ్యులు దాస్యం వినయ్ భాస్కర్ ఆదేశాల మేరకు, మాజీ కార్పొరేటర్ జోరిక రమేష్ హనుమకొండ జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో పాల్గొని, జిల్లా కలెక్టర్ ఏవో గౌరీ శంకర్ కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి వెయ్యి రోజులు పూర్తవుతున్నప్పటికీ ప్రజలకు ఇచ్చిన అనేక హామీలు నేటికీ పూర్తిస్థాయిలో అమలు కాలేదని ఆయన పేర్కొన్నారు. ప్రజల సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వం చిత్తశుద్ధితో వ్యవహరించాలని, ఎన్నికల హామీలను కేవలం ప్రచారానికే పరిమితం చేయకుండా వాటిని ఆచరణలోకి తీసుకురావాలని కోరారు. ప్రజల సంక్షేమం, విద్య, వైద్యం, రైతులు, యువత, మహిళలు, ఉద్యోగులు, పేదలు తదితర వర్గాలకు సంబంధించిన సమస్యలపై ప్రభుత్వం తక్షణమే దృష్టి సారించాలని డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ పార్టీ ప్రజల పక్షాన నిరంతరం పోరాడుతుందని, ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేసే వరకు ప్రజా సమస్యలపై ఉద్యమాలను మరింత ఉధృతం చేస్తామని ఈ సందర్భంగా నాయకులు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ ప్రభుత్వంపై దాస్యం ఫైర్

- బీఆర్ఎస్ ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలను అసెంబ్లీకి రానివ్వకపోవడంపై మండిపాటు
- ప్రతిపక్ష ప్రజాప్రతినిధుల హక్కులను కాలరాస్తున్నారని ఆగ్రహం
- హన్మకొండలో భారీ ధర్నా.. ప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం





**అక్షరశక్తి, హనుమకొండ:** బిఆర్ఎస్ ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలను అసెంబ్లీకి రాకుండా ప్రభుత్వం వ్యవహరించిన తీరును నిరసిస్తూ బిఆర్ఎస్ పార్టీ పిలుపుమేరకు హనుమకొండ చౌరస్తాలో మాజీ చీఫ్ విప్, మాజీ శాసనసభ్యులు దాస్యం వినయ్ భాస్కర్ ఆధ్వర్యంలో బిఆర్ఎస్ శ్రేణులు పెద్ద ఎత్తున ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా బిఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు ప్రభుత్వ తీరును తీవ్రంగా ఖండిస్తూ రాస్తారోకో నిర్వహించారు. అనంతరం ప్రభుత్వ వైఖరికి నిరసనగా దిష్టిబొమ్మను దహనం చేశారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో ప్రజల తరఫున తమ వాణిని వినిపించాల్సిన ప్రజాప్రతినిధులను అసెంబ్లీకి రాకుండా అడ్డుకోవడం సరైన పద్ధతి కాదని వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. అసెంబ్లీ అనేది ప్రజా సమస్యలను చర్చించి, వాటికి పరిష్కార మార్గాలను సూచించే ప్రజాస్వామ్య వేదిక అని, ప్రతిపక్ష ప్రజాప్రతినిధులకు కూడా తమ నియోజకవర్గాలు, ప్రజల సమస్యలను సభలో ప్రస్తావించే పూర్తి హక్కు ఉందని బిఆర్ఎస్ నాయకులు పేర్కొన్నారు. ప్రజల గొంతుకగా నిలిచే బిఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలను సభకు దూరంగా ఉంచే ప్రయత్నాలను తీవ్రంగా వ్యతిరేకిస్తామని తెలిపారు. ఈ సందర్భంగా దాస్యం వినయ్ భాస్కర్ మాట్లాడుతూ, ప్రతిపక్ష ప్రజాప్రతినిధుల హక్కులను కాలరాస్తూ ప్రభుత్వం వ్యవహరించడం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమని అన్నారు. ప్రజా సమస్యలపై ప్రశ్నించే గొంతులను అణచివేయడం ద్వారా సమస్యలు పరిష్కారం కావని, ప్రజాస్వామ్యంలో నిరసన తెలిపే హక్కును ప్రతి ఒక్కరూ గౌరవించాలని అన్నారు. బిఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలను అసెంబ్లీలో ప్రజా సమస్యలు లేవనెత్తకుండా అడ్డుకునే చర్యలను ప్రభుత్వం వెంటనే విరమించుకోవాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం తన వైఖరిని మార్చుకుని ప్రతిపక్ష ప్రజాప్రతినిధులకు సభలో తమ వాణిని వినిపించే అవకాశం కల్పించాలని, ప్రజాస్వామ్య విలువలను కాపాడాలని ఆయన డిమాండ్ చేశారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసం బిఆర్ఎస్ పార్టీ నిరంతరం ప్రజల పక్షాన పోరాడుతుందని స్పష్టం చేశారు. రాస్తారోకో సందర్భంగా హనుమకొండ చౌరస్తాలో కొంతసేపు ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. అనంతరం పోలీసులు ఆందోళనలో పాల్గొన్న దాస్యం వినయ్ భాస్కర్ గారితో పాటు బిఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలను అరెస్టు చేసి హనుమకొండ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ కార్యక్రమంలో మాజీ కుడా చైర్మన్ మర్రి యాదవరెడ్డి, మాజీ కార్పొరేటర్లు, బిఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొని ప్రభుత్వ తీరుకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు.

# ఎమ్మెల్సీ తాతా మధు సభ్యత్వం రద్దు చేయాలి

- స్పీకర్‌ను అవమానించడం ప్రజాస్వామ్యాన్ని అవమానించడమే
- తాతా మధు వ్యాఖ్యలకు కేసీఆర్ సమాధానం చెప్పాలి..
- వరంగల్ డీసీసీ అధ్యక్షుడు అయూబ్



**అక్షరశక్తి, వరంగల్:** శాసనసభ స్పీకర్ స్థానంలో ఉన్న దళిత నేతపై అత్యంత హేయంగా, అనుచిత వ్యాఖ్యలు చేసిన బీఆర్ఎస్ ఎమ్మెల్సీ తాత మధును వెంటనే సస్పెండ్ చేయాలని వరంగల్ డీసీసీ అధ్యక్షుడు అయూబ్ డిమాండ్ చేశారు. తెలంగాణ శాసనసభ సాక్షిగా ఉన్నత పదవిలో ఉన్న స్పీకర్‌పై బీఆర్ఎస్ ఎమ్మెల్సీ తాతా మధు చేసిన అనుచిత వ్యాఖ్యలను నిరసిస్తూ టీపీసీసీ ఆదేశాల మేరకు నేడు వరంగల్‌లోని పోచమ్మ మైదాన్ సెంటర్‌లో వరంగల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మహమ్మద్ అయూబ్ జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షుడు చిలువేరు శ్రీనివాస్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ శ్రేణులు పెద్ద సంఖ్యలో పాల్గొని తీవ్ర నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా తాతా మధు దిష్టిబొమ్మను దహనం చేసి, ఆయనపై బీఆర్ఎస్ పార్టీ తక్షణమే క్రమశిక్షణ చర్యలు తీసుకోవాలని, స్పీకర్‌కు బహిరంగ క్షమాపణ చెప్పాలని కాంగ్రెస్ పార్టీ నాయకులు డిమాండ్ చేశారు.

ఈ సందర్భంగా డీసీసీ అధ్యక్షుడు మహమ్మద్ అయూబ్ మాట్లాడుతూ--- ఒక దళిత బిడ్డ రాష్ట్ర శాసనసభ స్పీకర్‌గా ఉన్నత స్థానంలో కొనసాగుతుండగా, ఆయనపై బీఆర్ఎస్ ఎమ్మెల్సీ తాతా మధు అనుచిత వ్యాఖ్యలు చేయడం సిగ్గుచేటని అన్నారు. దళితుడిని ముఖ్యమంత్రిని చేస్తామని హామీ ఇచ్చి పదేళ్లు అధికారంలో కొనసాగిన బీఆర్ఎస్ నాయకులు, ఇప్పుడు అదే దళిత సామాజిక వర్గానికి చెందిన వ్యక్తి స్పీకర్‌గా ఉన్నత పదవిలో కొనసాగడాన్ని జీర్ణించుకోలేక ఇలాంటి వ్యాఖ్యలకు దిగడం వారి అహంకారానికి నిదర్శనమని అయూబ్ మండిపడ్డారు. ప్రజల సమస్యలపై చర్చించాల్సిన శాసనసభ్యులు వ్యక్తిగత దూషణలకు దిగడం ప్రజాస్వామ్యానికి చీకటి రోజని అన్నారు. పదేళ్లు అధికారంలో ఉండి ప్రజా సమస్యలను పట్టించుకోని బీఆర్ఎస్ నాయకులు, ప్రతిపక్షంలో ఉన్నా తమ వైఖరిని మార్చుకోలేదని విమర్శించారు. రాజ్యాంగబద్ధమైన పదవిలో ఉన్న స్పీకర్‌ను అవమానించేలా వ్యాఖ్యలు చేసిన తాతా మధుపై బీఆర్ఎస్ పార్టీ తక్షణమే క్రమశిక్షణ చర్యలు తీసుకోవాలని, ప్రజలకు బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. స్పీకర్ పదవికి ఉన్న గౌరవాన్ని కించపరిచే వ్యాఖ్యలను కాంగ్రెస్ పార్టీ ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించబోదని డీసీసీ అధ్యక్షుడు మహమ్మద్ అయూబ్ స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్సీ సెల్ చైర్మన్ చిలువేరు శ్రీనివాస్, యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు కొరివి పరమేష్, ప్రజా ప్రతినిధులు, మాజీ ప్రజా ప్రతినిధులు, మండల, టౌన్, డివిజన్, వివిధ అనుబంధ సంఘాల నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## వినాయకుల నిమజ్జనానికి
# చెరువుల పరిశీలన



**అక్షరశక్తి, నర్సంపేట :** నర్సంపేట మున్సిపల్ పరిధిలోని దామర చెరువు, మాదన్నపేట చెరువులను, సోమవారం నాడు నర్సంపేట మున్సిపల్ కమిషనర్ కాటం భాస్కర్, నర్సంపేట మున్సిపల్ వైస్ చైర్మన్ గంధం నరేందర్ గుప్తా, నర్సంపేట టౌన్ సీఐ ముస్క శ్రీనివాస్ తో కలిసి నర్సంపేట మున్సిపల్ చైర్ పర్సన్ పెండెం శ్రీలక్ష్మీరామానంద్ పరిశీలించారు. వినాయకుడి నిమజ్జనాలు సజహావుగా నిర్వహించుకునే కొరకు మాదన్నపేట చెరువులోని కొంత భాగాన్ని పరిశీలించడం జరిగిందని అన్నారు, పర్యవరణానికి, కాలుష్యానికి హాని కలగకుండా మున్సిపల్ పరిధిలో సాధ్యమైనంత వరకు మట్టి విగ్రహాలను ఏర్పాటు చేసుకోవాలని వినాయక నవరాత్రి ఉత్సవాల కమిటీ సభ్యులను కోరారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఏఈ చంద్రమౌళి, స్థానిక కౌన్సిలర్ కొత్తకొండ మేఘనశ్యాంరాజ్, కౌన్సిలర్లు ముత్తినేని వెంకన్న, బీరం భరత్ రెడ్డి, ఏపూరి శ్రీనివాస్ రెడ్డి, ఎలకంటి విజయ్ కుమార్, సలావుద్దీన్ ఆయూబ్ ఖాన్, పొన్నాల మనీషాప్రకాష్, శ్రీరామోజు రోజారాణి, ఇస్లావత్ రామాగోపి నాయక్, నర్సంపేట పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు పంబి వంశీకృష్ణ, నర్సంపేట నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు తుమ్మలపెల్లి సందీప్, నర్సంపేట మార్కెట్ డైరెక్టర్ కొల్లూరి మధుకర్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రజల సమస్యలకు తక్షణ పరిష్కారమే లక్ష్యం

**ప్రజాదివాస్‌లో జిల్లా ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్**



**అక్షరశక్తి, భూపాలపల్లి :** భూపాలపల్లి జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజాదివాస్ కార్యక్రమంలో జిల్లా ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్ ప్రజల నుంచి నేరుగా ఫిర్యాదులను స్వీకరించి, వాటి పరిష్కారానికి తక్షణ చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యాప్తంగా వచ్చిన ఫిర్యాదుదారుల నుంచి మొత్తం 18 ఫిర్యాదులు స్వీకరించారు. ప్రతి ఫిర్యాదును ఎస్పీ శ్రద్ధగా విని, సంబంధిత పోలీస్ స్టేషన్ సీఐలు, ఎస్ఐలతో నేరుగా మాట్లాడి, సమస్యల పరిష్కారానికి అవసరమైన సూచనలు, ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ, ప్రజలు ఎలాంటి పైరవీలు లేదా మూడో వ్యక్తి ప్రమేయం లేకుండా నిర్భయంగా పోలీస్ సేవలను వినియోగించుకోవాలని సూచించారు. చట్టబద్ధమైన విధానంలో ప్రతి ఒక్కరికీ న్యాయం జరిగేలా పోలీస్ శాఖ కట్టుబడి ఉందని, ప్రజలకు మరింత చేరువగా ఉండి శాంతి భద్రతలను పరిరక్షించడం పోలీసుల ప్రధాన బాధ్యత అని తెలిపారు. ప్రతి సోమవారం నిర్వహిస్తున్న ప్రజాదివాస్ కార్యక్రమం ద్వారా ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకుని, సంబంధిత అధికారుల సమన్వయంతో త్వరితగతిన పరిష్కరిస్తున్నామని పేర్కొన్నారు. ప్రజలకు సత్వర, పారదర్శకమైన సేవలు అందించేందుకు భూపాలపల్లి జిల్లా పోలీస్ శాఖ ఎల్లప్పుడూ కృషి చేస్తుందని జిల్లా ఎస్పీ తెలిపారు.

# కేటీఆర్, హరీశ్‌రావు అరెస్టు..









- నల్ల టీషర్టులు ధరించి బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీల నిరసన
- అసెంబ్లీలోకి వెళ్లకుండా అడ్డుకున్న పోలీసులు
- అసెంబ్లీ మెయిన్ గేట్ వద్ద ఉద్రిక్తత



**అక్షరశక్తి, హైదరాబాద్:** అసెంబ్లీ సమావేశాల సందర్భంగా సోమవారం నాడు అసెంబ్లీ గేటు వద్ద తీవ్ర ఉద్రిక్త వాతావరణ నెలకొంది. కాంగ్రెస్ 1000 రోజుల పాలన వైఫల్యాన్ని నిరసిస్తూ నల్ల టీషర్టులతో అసెంబ్లీకి వచ్చిన బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలను పోలీసులు అడ్డుకున్నారు. ఈ సందర్భంగా పోలీసులు, బీఆర్ఎస్ ఎమ్మెల్యేల మధ్య తోపులాట జరిగింది. ఈ క్రమంలో కేటీఆర్, హరీశ్‌రావు సహా బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు పోలీసులు అరెస్టు చేశారు. వారిని బలవంతంగా వాహనంలోకి ఎక్కించి భవన్‌కు తరలించారు. నల్ల టీషర్టులు ధరించి అసెంబ్లీ రావడంతో బీఆర్ఎస్ ఎమ్మెల్యేలను పోలీసులు అడ్డుకున్న క్రమంలో తోపులాట జరిగింది. ఈ ఘటనలో జగదీశ్ రెడ్డి కింద పడటంతో అతని కాలికి గాయమైంది. పోలీసుల తోపులాటలో కేటీఆర్ చేతికి, నుదిటికి గాయాలయ్యాయి. పోలీసులతో జరిగిన తోపులాటలో హరీశ్‌రావు కిందపడ్డారు. ఈ ఘటన అనంతరం నల్ల టీషర్టులతో అసెంబ్లీ లోపలికి అనుమతించకపోవడంతో హరీశ్‌రావు టీషర్ట్ విప్పి బనియన్‌తో నిరసన తెలిపారు. అనంతరం అసెంబ్లీ లోపలికి వెళ్లేందుకు ప్రయత్నించగా.. ఆయన్ను పోలీసులు అరెస్టు చేశారు. ఇక రేవంత్ రెడ్డి పాలనలో అసెంబ్లీ కౌరవ సభగా మారిపోయిందంటూ బీఆర్ఎస్ నేతలు మండిపడ్డారు. అసెంబ్లీ సమావేశాలకు హాజరయ్యేందుకు వెళ్తుండగా బీఆర్ఎస్ ఎమ్మెల్యే సునీతా లక్ష్మారెడ్డి చీరను పోలీసులు లాగారని ఆరోపించారు. మహిళా సభ్యులతో ఇలాగేనా వ్యవహరించేదని ఆమె కన్నీళ్లు పెట్టుకున్నారు. ఈ సందర్భంగా సబితా ఇంద్రారెడ్డి ఆమెను ఓదార్చారు. అసెంబ్లీ సమావేశాల వేళ ఈ వరుస ఘటనలతో అక్కడ ఉద్రిక్త వాతావరణం నెలకొంది.

## ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేయాలి

- రూ.14 వేల కోట్ల బకాయిలతో 30 లక్షల మంది విద్యార్థులకు ఇబ్బందులు
- విడతల వారీగానైనా నిధులు మంజూరు చేయాలి
- బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ జేఏసీ డిమాండ్




**అక్షరశక్తి, హనుమకొండ:** రాష్ట్రవ్యాప్తంగా నాలుగేళ్లుగా పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేసి విద్యార్థులను ఆదుకోవాలని బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ జేఏసీ డిమాండ్ చేసింది. సోమవారం హనుమకొండ ఏకశిలా పార్కు వద్ద జేఏసీ ఆధ్వర్యంలో నిర్వహించిన ధర్నాలో పలువురు బీసీ సంఘాల నాయకులు, మేధావులు, విద్యార్థులు పాల్గొన్నారు. జిల్లా కన్వీనర్, కోఆర్డినేటర్లు కొట్టె యూసఫ్, మేకల సుమన్ అధ్యక్షతన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా జేఏసీ ఉమ్మడి వరంగల్ జిల్లా చైర్మన్ డాక్టర్ చందా మల్లయ్య, రాష్ట్ర కార్యదర్శి పోదుల సాయిబాబా మాట్లాడుతూ ఇంటర్, డిగ్రీ, పీజీ, ఇంజనీరింగ్, మెడికల్ తదితర కోర్సులు చదువుతున్న విద్యార్థులకు ఏళ్ల తరబడి ఫీజు రీయింబర్స్‌మెంట్ అందక తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయని అన్నారు. ఫీజులు చెల్లించలేక కొంతమంది విద్యార్థులు చదువును మధ్యలోనే నిలిపివేస్తున్నారని తెలిపారు. ఫీజులు చెల్లించేందుకు తల్లిదండ్రులు బంగారం, ఇళ్లు, స్థలాలు విక్రయించడంతో పాటు అధిక వడ్డీలకు అప్పులు చేయాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రవ్యాప్తంగా సుమారు 30 లక్షల మంది విద్యార్థులకు రూ.14 వేల కోట్ల మేర ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు ఉన్నాయని పేర్కొన్నారు. ప్రభుత్వం మొత్తం నిధులను ఒకేసారి విడుదల చేయలేని పరిస్థితి ఉంటే కనీసం విడతల వారీగా అయినా బకాయిలను మంజూరు చేసి విద్యార్థుల భవిష్యత్తును కాపాడాలని డిమాండ్ చేశారు. విద్యాశాఖ మంత్రి, ముఖ్యమంత్రి వెంటనే స్పందించి బకాయిల విడుదలకు చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో తెలంగాణ బీసీ సేన అధ్యక్షుడు క్రాంతికుమార్, కార్యదర్శి గొల్లపల్లి వీరస్వామి, మాదాసి సురేష్, సుధాకర్, రోడ్డ మురళీకృష్ణ, నాగరాజు, రవీందర్, సదానందం, జానకిరాములు తదితరులు పాల్గొన్నారు.

## ఎస్ఐఆర్‌లో అనామలీస్, నో మ్యాపింగ్ ఓటర్లకు నోటీసులు ఇవ్వాలి

- పకడ్బందీగా విచారణ చేపట్టాలి: రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సి. సుదర్శన్ రెడ్డి



**అక్షరశక్తి,హనుమకొండ:** ప్రత్యేక ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్)లో అనామలీస్, నో మ్యాపింగ్ కేటగిరీలో గుర్తించిన ప్రతి ఓటరుకు నోటీసులు అందించి, పకడ్బందీగా విచారణ చేపట్టాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సి. సుదర్శన్ రెడ్డి జిల్లా ఎన్నికల అధికారులను ఆదేశించారు. సోమవారం హైదరాబాద్ నుంచి జిల్లా కలెక్టర్లతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఎస్ఐఆర్ ప్రక్రియ పురోగతిని సమీక్షించారు. నోటీసులు అందించిన అనంతరం ఓటర్లకు విచారణకు పూర్తి అవకాశం కల్పించి, వివరాలను నిబంధనల ప్రకారం క్షుణ్ణంగా పరిశీలించాలని సూచించారు. విచారణ ప్రక్రియను పారదర్శకంగా, నిబంధనల ప్రకారం నిర్వహించాలని, ప్రతి కేసుకు సంబంధించిన వివరాలను సక్రమంగా నమోదు చేయాలని సుదర్శన్ రెడ్డి ఆదేశించారు. నిర్ణీత గడువులోగా నోటీసుల పంపిణీ, విచారణ ప్రక్రియను పూర్తి చేయడంతో పాటు అర్హులైన ఓటర్ల హక్కులను పరిరక్షిస్తూ అనామలీస్, నో మ్యాపింగ్ అంశాలను పరిష్కరించాలని సూచించారు. హనుమకొండ కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయి, అదనపు కలెక్టర్ ఎన్. రవి, ఇతర అధికారులు పాల్గొన్నారు. జిల్లాలో ఇప్పటివరకు నో మ్యాపింగ్, అనామలీస్ జాబితాలోని ఓటర్లకు సుమారు 75 శాతం నోటీసుల జారీ ప్రక్రియ పూర్తయిందని కలెక్టర్ చాహత్ బాజ్‌పాయి తెలిపారు. విచారణలు సజావుగా కొనసాగుతున్నాయని, విచారణలకు హాజరుకాని వారికి రెండోసారి నోటీసులు జారీ చేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. పత్రాల అప్‌లోడ్‌పై ఏఈఆర్ఓలకు ప్రత్యేక శిక్షణ ఇచ్చామని, ప్రస్తుతం ఎలాంటి సమస్యలు లేవని తెలిపారు. సమావేశంలో హనుమకొండ ఆర్డీవో, వరంగల్ పశ్చిమ ఈఆర్ఓ వెంకటేష్, ఏఈఆర్ఓ రవీందర్ రెడ్డి, ఎన్నికల విభాగం సూపరింటెండెంట్ జగత్ సింగ్ తదితరులు పాల్గొన్నారు.

# అభివృద్ధి పనులను వేగవంతంగా పూర్తి చేయాలి

- బిల్లుల చెల్లింపులు సకాలంలో జరిగేలా చర్యలు చేపట్టాలి
- హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయి
- వివిధ శాఖల అధికారులతో కలెక్టర్ సమీక్షా సమావేశం



**అక్షరశక్తి, హన్మకొండ :** జిల్లాలో చేపట్టిన అభివృద్ధి పనులను వేగవంతంగా పూర్తి చేయాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి అన్నారు. సోమవారం హనుమకొండ జిల్లా కలెక్టరేట్ లోని మినీ కాన్ఫరెన్స్ హాలులో పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ శాఖ ఆధ్వర్యంలో చేపట్టిన గ్రామపంచాయతీ, అంగన్వాడీ కేంద్రాలు , మహిళా సంఘాల భవనాల నిర్మాణ పనుల పురోగతిపై పంచాయతీరాజ్ ఇంజినీరింగ్, డీఆర్డీఏ, మహిళా శిశు సంక్షేమ శాఖల అధికారులతో కలెక్టర్ సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. మండలాల వారీగా అభివృద్ధి పనుల పురోగతిని సంబంధిత శాఖల అధికారులను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. గ్రామపంచాయతీ, అంగన్వాడీ కేంద్రాలు మహిళా సంఘాల భవనాల నిర్మాణ, తదితర అభివృద్ధి పనులను నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలన్నారు. పూర్తయిన అభివృద్ధి పనులకు సంబంధించిన బిల్లుల రికార్డు ప్రక్రియను ఎప్పటికప్పుడు పూర్తి చేసి, సకాలంలో చెల్లింపులు జరిగేలా చర్యలు తీసుకోవాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. అదేవిధంగా ఇంకా అభివృద్ధి పనులు అవసరమైన గ్రామాలను గుర్తించి, ఆయా ప్రాంతాల అవసరాలకు అనుగుణంగా కొత్త ప్రతిపాదనలు సిద్ధం చేసి సమర్పించాలని అధికారులకు సూచించారు. అభివృద్ధి పనుల ను ఎలాంటి జాప్యం లేకుండా అధికారులు సమన్వయంతో పూర్తి చేయాలని కలెక్టర్ పేర్కొన్నారు. ఈ సమావేశంలో డీఆర్డీవో మేన శ్రీను, జిల్లా సంక్షేమ అధికారి విశ్వజ, పంచాయతీ రాజ్ ఇంజినీరింగ్ డీఈలు రాజగోపాల్ రావు, శ్రీనివాస్ రావు, శిరీష, యుగంధర్, రామ్ దేవ్ అగర్వాల్, ఏఈలు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

# జన సమూహాల నిర్వహణపై పోలీస్ శిక్షకులకు నాలుగు రోజుల శిక్షణ






**అక్షరశక్తి,హనుమకొండ:** పండగలు, జాతరలు, ఊరేగింపుల సందర్భంగా భారీగా జన సమూహాలు ఏర్పడినప్పుడు ప్రజలతో పోలీసులు వ్యవహరించాల్సిన తీరుపై పోలీస్ శిక్షకులకు నాలుగు రోజుల శిక్షణ తరగతులు సోమవారం మడికొండలోని పోలీస్ శిక్షణ కేంద్రంలో ప్రారంభమయ్యాయి. భద్రాద్రి జోనల్ పరిధిలోని వరంగల్, ఖమ్మం పోలీస్ కమిషనరేట్లతో పాటు మహబూబాబాద్, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలకు చెందిన ఆర్ఐలు, ఆర్ఎస్ఐలు, హెడ్ కానిస్టేబుళ్లు, కానిస్టేబుళ్లు కలిపి మొత్తం 43 మంది పోలీస్ శిక్షకులు ఈ శిక్షణలో పాల్గొంటున్నారు. పండగలు, జాతరలు, ఊరేగింపుల సమయంలో భారీగా ప్రజలు గుమిగూడినప్పుడు శాంతిభద్రతలను సమర్థవంతంగా నిర్వహించడంతో పాటు, ప్రజలతో పోలీసులు మర్యాదపూర్వకంగా, సంయమనంతో వ్యవహరించాల్సిన విధానాలపై శిక్షణ ఇస్తున్నారు. తరగతి గదుల్లో బోధనతో పాటు, వివిధ పరిస్థితుల్లో పోలీసులు వ్యవహరించాల్సిన తీరును ప్రాక్టికల్‌గా కూడా వివరించనున్నారు. వివిధ జిల్లాల నుంచి శిక్షణ పొందుతున్న పోలీస్ శిక్షకులు ఈ శిక్షణ అనంతరం తమ తమ జిల్లా పోలీస్ యూనిట్లలోని అధికారులు, సిబ్బందికి ఇదే తరహా శిక్షణ అందించనున్నారు. తద్వారా భారీ జన సమూహాలు ఉన్న సందర్భాల్లో పోలీసులు సమర్థవంతంగా విధులు నిర్వహించడంతో పాటు, ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా శాంతిభద్రతలను పరిరక్షించేలా చర్యలు తీసుకోనున్నారు. ఈ కార్యక్రమంలో అదనపు డీసీపీలు ప్రభాకర్‌రావు, శ్రీనివాస్, సీటీసీ ఏసీపీ రమణబాబు, ఆర్ఐ సింహాచలం శ్రీనివాస్, ఇన్‌స్పెక్టర్ సూర్యప్రసాద్‌తో పాటు శిక్షణ కేంద్రానికి చెందిన పోలీస్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

GUEST COLUMN

# భారత దేశంలో చట్టం అందరికీ సమానమేనా?

ఢిల్లీలో జంతర్‌మంతర్ వద్ద జరిగిన ఒక నిరసనలో ఒక కార్యకర్త తండ్రిపై దాడి చేశానని స్వయంగా చెప్పకున్న స్వతంత్ర భరద్వాజ్ అరెస్టు కావడం ఇప్పుడు ఒక వ్యక్తికి సంబంధించిన క్రిమినల్ కేసు మాత్రమే కాదు. ఇది భారత ప్రజాస్వామ్యంలో చట్టం, పోలీసు వ్యవస్థ, రాజకీయ పలుకుబడి, మీడియా స్వాతంత్ర్యం... ఈ నాలుగు వ్యవస్థలు పరస్పరం ఎలా పనిచేస్తున్నాయనే పెద్ద ప్రశ్నను ముందుకు తెచ్చింది.

స్వతంత్ర భరద్వాజ్‌కు సంబంధించిన వీడియో వైరల్ అయిన తరువాతే ఈ వ్యవహారం జాతీయ స్థాయిలో చర్చకు వచ్చింది. నివేదికల ప్రకారం, జంతర్‌మంతర్‌లో జరిగిన నిరసన సందర్భంగా నిషు ఆజాద్ తండ్రి సంజయ్ కుమార్‌పై భరద్వాజ్ దాడి చేశాడని ఆరోపణ ఉంది. అనంతరం ఒక పోడ్‌కాస్ట్‌లో తానే దాడి చేసినట్టు అతను చెప్పిన వీడియో విస్తృతంగా ప్రచారంలోకి వచ్చింది. తన రాజకీయ పరిచయాలను కూడా అతను ప్రస్తావించినట్టు పలు మీడియా సంస్థలు రాశాయి. అయితే అతను తరువాత ఆ దాడిని ఆత్మరక్షణలో భాగమని వాదించాడు. ఢిల్లీ పోలీసులు కూడా సంజయ్ కుమార్‌కు తలకు గాయం అయిన విషయాన్ని అంగీకరించినప్పటికీ, అది సాధారణ స్వభావం గల గాయమని, పుర్రె పగిలిందన్న ప్రచారం వాస్తవం కాదని స్పష్టం చేశారు.

ఇక్కడ అసలు ప్రశ్న గాయం తీవ్రత గురించి మాత్రమే కాదు. ఒక వ్యక్తిపై దాడి జరిగిందన్న ఫిర్యాదు, ఎఫ్ఐఆర్ ఉన్నప్పుడు, నిందితుడు స్వయంగా దాడి గురించి బహిరంగంగా మాట్లాడినప్పుడు, పోలీసుల స్పందన ఎందుకు అంత ఆలస్యమైంది అన్నదే. శుక్రవారం పార్లమెంట్ స్ట్రీట్ పోలీస్ స్టేషన్ వద్ద నిరసన జరగడం, పోలీసులు 72 గంటల్లో చర్య తీసుకుంటామని హామీ ఇవ్వడం, ఆ తర్వాత కొద్ది గంటల్లోనే ఉత్తరప్రదేశ్‌లోని బులంద్‌షహర్‌లో అతన్ని పట్టుకోవడం, ఈ పరిణామాలు ముందే ఎందుకు చర్య తీసుకోలేదన్న అనుమానాన్ని సహజంగానే పెంచుతున్నాయి.

అయితే ఇక్కడ ఒక ముఖ్యమైన జాగ్రత్త అవసరం. భరద్వాజ్‌కు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, కేంద్ర మంత్రి చిరాగ్ పాశ్వాన్, ఢిల్లీ మంత్రి కపిల్ మిశ్రా తదితరుల అండ ఉందన్న అతని వ్యాఖ్యలు అతని స్వంత వాదనలు మాత్రమే. అవి నిజమని నిర్ధారించే ఆధారాలు ఇప్పటివరకు బహిరంగంగా కనిపించడం లేదు. ఢిల్లీ పోలీసులు కూడా రాజకీయ జోక్యం ఆరోపణలను ఖండించారు. అందువల్ల వ్యక్తి చేసిన రాజకీయ పేర్ల ప్రస్తావనను ఆధారంగా చేసుకుని మొత్తం ప్రభుత్వాన్ని నిందించడం కంటే, ఆ వాదనపై స్వతంత్ర దర్యాప్తు జరగాలని డిమాండ్ చేయడం ప్రజాస్వామ్యపరంగా బలమైన వైఖరి.

కానీ ఈ సంఘటన లేవనెత్తుతున్న వ్యవస్థాగత ప్రశ్న మాత్రం తప్పించుకోలేనిది. భారతదేశంలో అధికారానికి దగ్గరగా ఉన్న వ్యక్తులపై పోలీసు వ్యవస్థ ఎంత వేగంగా పనిచేస్తోంది? అధికారాన్ని ప్రశ్నించే నిరసనకారులు, విద్యార్థులు, జర్నలిస్టులు, మేధావులు, మానవ హక్కుల కార్యకర్తల విషయంలో అదే ప్రమాణాలు అమలవుతున్నాయా?

గత దశాబ్దపు అనుభవాలు ఈ ప్రశ్నను మరింత తీవ్రంగా మారుస్తున్నాయి. మానవ హక్కుల సంస్థలు, అంతర్జాతీయ పరిశీలకులు, న్యాయస్థానాల వివిధ వ్యాఖ్యలు, ప్రభుత్వాన్ని విమర్శించే వ్యక్తులపై కఠినమైన చట్టాల వినియోగం, దీర్ఘకాలిక విచారణకు ముందరి నిర్బంధం, జర్నలిస్టులపై దర్యాప్తులు వంటి అంశాలపై ఆందోళన వ్యక్తం చేశాయి. 2019–2023 మధ్య యూఏపీఏ కింద దేశవ్యాప్తంగా 10,440 మంది అరెస్టయ్యారని, అదే కాలంలో 335 మందికి మాత్రమే శిక్షలు విధించబడ్డాయని పార్లమెంటరీ గణాంకాల ఆధారంగా విశ్లేషణలు పేర్కొన్నాయి. ఈ సంఖ్యలు ఒక్కటే ప్రతి కేసు తప్పుడు కేసు అని నిరూపించవు; కానీ అరెస్టు మరియు తుది నేర నిర్ధారణ మధ్య ఉన్న భారీ అంతరాన్ని మాత్రం చూపిస్తాయి.

కాశ్మీర్‌లో జర్నలిస్టులు, మానవ హక్కుల కార్యకర్తలపై కేసులు, అరెస్టులు, దాడులు, విచారణలు కొనసాగినట్లు హ్యూమన్ రైట్స్ వాచ్ నమోదు చేసింది. 2019 తర్వాత కనీసం 35 మంది కాశ్మీరీ జర్నలిస్టులు విచారణలు, దాడులు, బెదిరింపులు, ప్రయాణ ఆంక్షలు లేదా క్రిమినల్ కేసులను ఎదుర్కొన్నారని ఆ సంస్థ పేర్కొంది.

ఇదే సమయంలో అధికారానికి అనుకూలంగా ఉన్న వ్యక్తులు చట్టాన్ని తమ చేతుల్లోకి తీసుకున్నట్టు కనిపించే సందర్భాలు ఉంటే, ప్రజల్లో ఏర్పడే భావన మరింత ప్రమాదకరం—"అధికారం ఉన్నవారికి ఒక చట్టం, మిగిలిన వారికి మరో చట్టం" అన్న భావన. ప్రజాస్వామ్యంలో ఈ భావన ఏర్పడటమే ఒక తీవ్రమైన సంస్థాగత వైఫల్యం.

ఉత్తరప్రదేశ్‌లో 'బుల్డోజర్ న్యాయం'పై సుప్రీంకోర్టు జోక్యం కూడా ఇదే సమస్యను మరో కోణంలో చూపించింది. 2024 నవంబర్‌లో సుప్రీంకోర్టు నేరానికి నిందితుడిగా ఉన్నంత మాత్రాన అతని ఇల్లు లేదా ఆస్తిని కూల్చివేయడం రాజ్యాంగబద్ధం కాదని స్పష్టం చేసింది. ముందస్తు నోటీసు, అభ్యంతరం చెప్పే అవకాశం, చట్టపరమైన ప్రక్రియ వంటి నిబంధనలను తప్పనిసరి చేసింది. కార్యనిర్వాహక వ్యవస్థ న్యాయస్థానంగా మారకూడదని కోర్టు స్పష్టం చేసింది.

అలాగే ఉత్తరప్రదేశ్‌లో 'ఎన్‌కౌంటర్' సంస్కృతిపై కూడా జాతీయ మానవ హక్కుల కమిషన్ గతంలో తీవ్రమైన ప్రశ్నలు లేవనెత్తింది. 2017లో యూపీ ప్రభుత్వం ఏర్పడిన తొలి ఆరు నెలల్లోనే 433 ఎన్‌కౌంటర్లు జరిగి, 19 మంది మరణించారని అధికారిక గణాంకాలను ఉటంకిస్తూ కమిషన్ నోటీసు జారీ చేసింది. 2018లో నోయిడా జిమ్ ట్రైనర్ జితేంద్ర యాదవ్ కేసులో పోలీసుల 'ఫేక్ ఎన్‌కౌంటర్' ఆరోపణలు నిర్ధారించబడిన తరువాత, అతని కుటుంబానికి పరిహారం చెల్లించాలని కూడా ఎన్‌హెచ్‌ఆర్‌సీ సిఫారసు చేసింది.

ఇది ఒక పార్టీకి మాత్రమే సంబంధించిన సమస్యగా చూడటం కూడా సరైంది కాదు. ఏ రాజకీయ పార్టీ అధికారంలో ఉన్నా పోలీసు, దర్యాప్తు సంస్థలు, మీడియా, న్యాయవ్యవస్థల స్వతంత్రత ప్రజాస్వామ్యానికి ప్రాణాధారం. అయితే గత పన్నెండేళ్లలో కేంద్రంలో బీజేపీ నేతృత్వంలోని ప్రభుత్వంపై అధికార సంస్థలను ప్రతిపక్షాలు, జర్నలిస్టులు, కార్యకర్తలపై ఉపయోగిస్తున్నారనే ఆరోపణలు పదేపదే వచ్చాయి. 2026 హ్యూమన్ రైట్స్ వాచ్ నివేదిక కూడా ప్రభుత్వ విమర్శకులు, కార్యకర్తలు, విద్యార్థులపై కఠిన చట్టాల వినియోగంపై ఆందోళన వ్యక్తం చేసింది.

మీడియా విషయంలో కూడా విమర్శలు నిరాధారమైనవి కావు; "ప్రధాన ప్రింట్ , ఎలక్ట్రానిక్ మీడియా అదానీ, అంబానీ, బీజేపీ చేతుల్లో ఉంది" అని ఒకే అనే అభిప్రాయం ఇప్పటికే జాతీయ, అంతర్జాతీయ విషయంగా మారింది.దీనిపై విస్తృతంగా చర్చ జరుగుతోంది. రాయిటర్స్ ఇన్‌స్టిట్యూట్ 2025 నివేదిక ప్రకారం భారత మీడియా యాజమాన్యం కొద్దిమంది సంపన్న పారిశ్రామికవేత్తల చేతుల్లో కేంద్రీకృతమై ఉందని, ప్రధానమంత్రి మోదీకి అనుకూలంగా ఉన్న వ్యాపార వర్గాలకు మీడియా యాజమాన్యంలో గణనీయమైన స్థానం ఉందని పేర్కొంది. అదే సమయంలో స్వతంత్ర డిజిటల్ మీడియా సంస్థలు కూడా ప్రత్యామ్నాయ కథనాలను ముందుకు తెస్తున్నాయని ఆ నివేదిక గుర్తించింది.

అందుకే సమస్య "మీడియా ప్రధాన మీడియాలో "ఎవరికి వార్త కనిపిస్తుంది? ఎవరికి ప్రధాన సమయం లభిస్తుంది? ఏ వార్త జాతీయ చర్చగా మారుతుంది? ఏది సోషల్ మీడియాలో మాత్రమే మిగిలిపోతుంది?" అనే ప్రశ్నలు కీలకం.

భరద్వాజ్ వ్యవహారంలోనూ ఇదే జరిగింది. ఒక వీడియో వైరల్ అయిన తరువాత మాత్రమే , ప్రధాన రాజకీయ చర్చ మొదలైంది. అంతకు ముందు ఈ ఘటనపై పోలీసు చర్య ఎంతవరకు జరిగిందో ప్రజలకు ఎవరికీ ,ఏమీ తెలియలేదు. ఇది మీడియా వైఫల్యమా, పోలీసు వైఫల్యమా, లేక రెండింటి కలయికా అన్నది దర్యాప్తు చేయాల్సిన ప్రశ్న.

ప్రజాస్వామ్యంలో బాధితుడికి న్యాయం కావాలంటే అతను "వైరల్ అయిన వీడియోను సాక్ష్యంగా చూపాల్సిన అవసరం ఉండకూడదు." నిందితుడు తన నేరం గురించి సోషల్ మీడియాలో చెప్పిన తర్వాతే పోలీసులు కదలాల్సిన పరిస్థితి ఉండకూడదు. అంతా వరకు డిల్లీ పోలీసులు ఏం చేసినట్లు? రాజకీయ పరిచయాలు ఉన్నంత మాత్రాన పోలీసులు చట్టాన్ని పాటించకుండా ఒక నిందితుడికి రక్షణ కవచంగా మారకూడదు కదా?. అదే సమయంలో రాజకీయ వ్యతిరేకత ఉన్న వ్యక్తిపై కూడా కేవలం ఆరోపణ ఆధారంగా ముందస్తు శిక్ష విధించకూడదు.

**ఇదే చట్టపాలనకు అసలు అర్థం:**
ఎవరైనా హిందుత్వవాది కావచ్చు, ముస్లిం కావచ్చు, దళిత ఉద్యమకారుడు కావచ్చు, కమ్యూనిస్టు కావచ్చు, బీజేపీ కార్యకర్త కావచ్చు, కాంగ్రెస్ కార్యకర్త కావచ్చు... నేరం చేస్తే దర్యాప్తు జరగాలి. ఆధారాలు ఉంటే అభియోగం మోపాలి; కోర్టులో నిరూపితమైతే శిక్ష పడాలి. అదే విధంగా అధికారాన్ని విమర్శించినందుకు ఎవరినీ నేరస్థుడిగా ముందుగానే నిర్ణయించకూడదు.

రేపు ప్రభుత్వం మారినప్పుడు గత ప్రభుత్వంపై విచారణలు జరగడం ప్రజాస్వామ్యంలో సాధ్యమే. కానీ ఎమర్జెన్సీ తర్వాత షా కమిషన్ తరహా విచారణల కోసం మరో తరం వేచి ఉండాల్సిన దుస్థితి బాధితులకు రాకూడదు. అధికారంలో ఏ పార్టీ ఉన్నా, దర్యాప్తు సంస్థలు తమ పని చట్టబద్ధంగా, స్వతంత్రంగా చేయాలి. అప్పుడే భవిష్యత్తులో ఏ ప్రభుత్వం వచ్చినా రాజకీయ ప్రతీకార దర్యాప్తుల అవసరం తగ్గుతుంది.

ఈ రోజు అసలు పరీక్ష స్వతంత్ర భరద్వాజ్ కేసులో ఒక్క అరెస్టుతో ముగియదు. ఆ దాడి వెనుక ఉన్న వాస్తవాలు ఏమిటి? ముందుగా పోలీసు ఎందుకు చర్య తీసుకోలేదు? ఎఫ్ఐఆర్‌లో సరైన సెక్షన్లు పెట్టారా? లేదా?రాజకీయ పరిచయాలపై చేసిన వాదనల్లో నిజం ఎంత? బాధిత కుటుంబానికి న్యాయం జరుగుతుందా? అలాగే రాజకీయంగా విరుద్ధ అభిప్రాయాలు వ్యక్తం చేసే వారిపై పోలీసులు అదే చట్టపరమైన ప్రమాణాలను పాటిస్తున్నారా? ఈ ప్రశ్నలకు పారదర్శక సమాధానాలు రావాలి.

ఎందుకంటే ఒక నిందితుడు అరెస్టు కావడం న్యాయవ్యవస్థ విజయం కాదు. అధికారానికి దగ్గరగా ఉన్న నిందితుడైనా, అధికారాన్ని ప్రశ్నించే బాధితుడైనా—ఇద్దరికీ ఒకే చట్టం వర్తించడం మాత్రమే నిజమైన ప్రజాస్వామ్య విజయం.

చట్టం ముందు అందరూ సమానమే అన్న రాజ్యాంగ వాగ్దానం కేవలం కాగితంపై ఉండటం సరిపోదు. అది పోలీస్ స్టేషన్ గుమ్మం దగ్గర, నిరసన ప్రదేశంలో, వార్తా గదిలో, కోర్టు గదిలో, చివరకు సామాన్య పౌరుడి జీవితంలో కనిపించాలి. లేకపోతే ప్రజాస్వామ్యం ఎన్నికల పండుగగా మాత్రమే మిగిలి, న్యాయం మాత్రం అధికారానికి అనుకూలంగా మారే ప్రమాదం ఉంటుంది.



- డాక్టర్.కోలాహలం రామ్ కిశోర్.
ramkishore.1504@gmail.com

Printer, Publisher by Palle Ravi Vamshi Mohan on behalf M/s Creative Media Group by Printed at Ramani Web Offset Printers H.No. 8-82/11/1, Autonagar, Bommakal Village, Mdl&Dist: Karimnagar-505001. T.S. Published at H.No. 2-1-14, Saraswathi Nagar, Vidyaranyapuri, Mdl: Hanamkonda, Dist: Warangal-506009. T.S. Editor: Dr PR Vamshimohan.